ఉమేశ్ చంద్ర సేవలు చిరస్మరణీయం

ఎస్ఆర్ నగర్ కూడలి వద్ద ఉన్న ఉమేశ్‌చంద్ర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన రాష్ట్ర డీజీపీ డా.జితేందర్ తదితరులు

వెంగళరావునగర్, సెప్టెంబర్ 4: పోలీస్ శాఖలో ఉత్తమ సేవ లందించిన ఐపీఎస్ అధికారి చదలవాడ ఉమేశ్ చంద్ర సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర డీజీపీ డా.జితేందర్ అన్నారు. దివంగత ఉమేశ్ చంద్ర వర్ధంతిని బుధవారం ఎస్ఆర్ నగర్ కూడలిలో ఉన్న ఆయన విగ్రహం వద్ద నిర్వహించారు. ఎస్ఆర్ నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి డీజీపీ డా.జితేందర్ హాజరయ్యారు. ఉమేశ్ చంద్ర విగ్రహానికి డీజీపీ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజల రక్షణ కోసం అహర్నిశలు శ్రమిస్తూ, తోటి సిబ్బంది కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ ఉమేశ్ చంద్ర పోలీసు వృత్తికి వన్నెతెచ్చారన్నారు. వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వర్తించి శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజల రక్షణ కోసం పని చేసిన ఘనత ఆయన సొంతమన్నారు. విధి నిర్వహణలో ఆయన అసువులు బాసినా.. పోలీసులు, ప్రజల గుండెల్లో సజీవంగానే ఉంటారన్నారు. డీజీపీతో పాటు స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ అదనపు డీజీ అనిల్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ గౌతం సవాంగ్, పశ్చిమ మండలం డీసీపీ విజయ్‌కుమార్, ఏసీపీ వెంకటరమణ, ఉమేశ్‌చంద్ర తండ్రి వేణుగోపాలరావు, తల్లి నయనతార, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు తదితరులు ఉమేశ్ చంద్ర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఫోన్ల ట్యాపింగ్ కేసులో..

నాంపల్లి కోర్టులు, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): ఫోన్ల ట్యాపింగ్ కేసులో మధ్యంతర బెయిల్‌పై కొనసాగుతున్న అదనపు ఎస్పీ భుజంగరావు కాంటినెంటల్ ఆస్పత్రిలోని అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్నాడు. తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యేంత వరకు ప్రస్తుత బెయిల్‌కు చెందిన షరతులు కొనసాగుతాయని బుధవారం కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

గంజాయి తరలిస్తున్న ముఠా అరెస్టు

- శామీర్‌పేటలో పట్టుబడ్డ నిందితులు
- 243 కేజీల గంజాయి, వాహనం సీజ్
- వివరాలు వెల్లడించిన మేడ్చల్ డీసీపీ ఎన్.కోటిరెడ్డి

వివరాలు వెల్లడిస్తున్న మేడ్చల్ డీసీపీ ఎన్.కోటిరెడ్డి

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 4: గుట్టుచప్పుడు కాకుండా స్టేట్ కార్గో ప్యాకర్స్ అండ్ మూవర్స్ మాటున గంజాయి తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా ఒకటి బుధవారం పోలీసులకు చిక్కింది. ఒడిశా నుంచి శామీర్‌పేటలోని ఓఆర్ఆర్ మీదుగా మహారాష్ట్రకు తరలిస్తున్న గంజాయి వాహనాన్ని పోలీసులు పట్టుకొని, నిందితులను రిమాండ్‌కు తరలించారు. మేడ్చల్ డీసీపీ ఎన్.కోటిరెడ్డి బుధవారం విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. మంగళవారం వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు బాలానగర్ ఎస్ఓటీ టీంతో పాటు శామీర్‌పేట పోలీసులు కలిసి శామీర్‌పేటలోని ఓఆర్ఆర్ మీదుగా వెళ్తున్న స్టేట్ కార్గో ప్యాకర్స్ అండ్ మూవర్స్ వాహనాన్ని ఆపి, తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో గంజాయి బయటపడింది. వాహనంతో పాటు సరుకును, నిందితులను అదుపులోకి తీసుకొని విచారించారు. ఈ విచారణలో హర్యానా ప్రాంతానికి చెందిన భజరంగ్ (23), రాజస్థాన్‌కు చెందిన గజేందర్ సింగ్ అలియాస్ గుజ్జు(26), హర్యానాకు చెందిన నరేశ్ చింగ్లా(40), కపిల్ శర్మ(28) కలిసి ఒక ముఠా ఏర్పాడ్డారు. ఒడిశా నుంచి మహారాష్ట్రకు అడ్డదారుల్లో గంజాయి సరఫరా చేస్తున్నారు. వీరిలో ప్రధాన నిందితుడైన భజరంగ్ కొన్నేండ్ల కిందట నగరంలోని బోయిన్‌పల్లిలో ఉన్నాడు. భజరంగ్ డ్రగ్ వ్యాపారి బలరాం వద్ద పని చేశాడు. డ్రగ్స్ కేసులో అరెస్టయిన బలరాం జైలుకు వెళ్లడంతో.. భజరంగ్ అతడి వ్యాపారాన్ని కొనసాగిస్తూ వస్తున్నాడు. ఒడిశాకు చెందిన శామ్యూయల్ అలియాస్ సుభాష్ ద్వారా అతడు గంజాయి కొనుగోలు చేసి.. ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లిస్తున్నాడు. అతడి నుంచి సరుకు తీసుకొని ఎవరికీ అనుమానం రాకుండా గూడ్స్ వాహనాల ద్వారా ఇతర సామగ్రితో కలిపి గంజాయి రవాణా చేస్తున్నాడు. ఒప్పందం మేరకు గంజాయిని మహారాష్ట్రలో ఉన్న రాకేశ్ అనే వ్యక్తికి పంపించేందుకు సిద్ధపడ్డారు. ఈ క్రమంలోనే పోలీసులకు పట్టుబడ్డారు. నిందితుల వద్ద నుంచి ఓ వాహనంతో పాటు సుమారు రూ.95.75 లక్షల విలువజేసే 243 కిలోల ఎండు గంజాయి, ఏడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ తెలిపారు. సమావేశంలో సైబరాబాద్ ఎస్ఓటీ డీసీపీ డి.శ్రీనివాస్, అదనపు డీసీపీ పి.శోభన్‌కుమార్, పేట్‌బషీరాబాద్ ఏసీపీ రాములు, బాలానగర్ ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు సీజ్ చేసిన గంజాయి

ఫంగస్ సోకిన ఆహార పదార్థాలు

అపరిశుభ్రంగా వంట గదులు

హోటళ్లు, రెస్టారెంట్లు, కేఫ్ నిర్వాహకులపై ఫుడ్ సేఫ్టీ అధికారుల చర్యలు

బంజారాహిల్స్ నిలోఫర్ కేఫ్‌లో గడువు తీరిన చీజ్, కేక్‌లు ఇతర ఆహార పదార్థాలు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): ఆహార నాణ్యతాప్రమాణాలు పాటించని హోటళ్లు, రెస్టారెంట్లు, కేఫ్‌లపై ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారుల చర్యలు కొనసాగుతున్నాయి. హబ్సీగూడలోని భీమవరం పలావ్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేపట్టగా.. నిర్వాహకులు ఫుడ్ లైసెన్స్ లేకుండానే వ్యాపారం చేస్తున్నట్లు గుర్తించారు. వంటగదిలో అపరిశుభ్రమైన వాతావరణం, ఫ్రిజ్‌లో ఉన్న వస్తువులకు లేబుల్స్ లేకపోవడం, ఫంగస్ సోకిన క్యారెట్స్ ఉన్నట్లు తేల్చారు. ఫ్రిజ్‌లో వెజ్ అండ్ నాన్‌వెజ్ కలిపి ఉన్నట్లు, సింథటిక్ ఫుడ్ కలర్, వంటగది రాక్‌లలో బొద్దింకల దాడి ఉన్నట్లు నిర్ధారించారు. దీంతో పాటు బంజారాహిల్స్ నిలోఫర్ కేఫ్‌లో నిబంధనలు ఉల్లంఘించారని తేల్చారు. ఫ్రిజ్‌లో ఉన్న చక్కెర సిరప్, మసాలా దినుసులు.. తదితర ఆహార పదార్థాలకు లేబుల్స్ లేవని, అమ్మకానికి ఉంచిన కేక్‌లకు లేబుల్ లేనట్లు, వంటగదిలో కాలం చెల్లిన చీజ్ (0.5 కిలోలు), కశ్మీరీ పప్పురికా పొడి, వేరు శనగలు (5 కిలోలు) ఉన్నట్లు గుర్తించి, వాటిని సీజ్ చేశారు. బంజారాహిల్స్ హైకు రెస్టారెంట్‌లోని వంటగదిలో నీరు, ఆహార వ్యర్థాలతో నిండిపోయిందని, అపరిశుభ్రంగా ఉన్నదని తేల్చారు. జీలకర్ర, నల్ల నువ్వులు, చింతపండు, ఎర్రతామర పిండి వంటి ఆహార పదార్థాల గడువు ముగిసినట్లు గుర్తించారు. హబ్సీగూడలో కృతుంగ ట్రైన్ రెస్టారెంట్‌లో నిబంధనల ఉల్లంఘన జరిగింది. బంజారాహిల్స్ రాజా డీలక్స్ రెస్టారెంట్‌లో రిఫ్రిజిరేటర్‌లో పచ్చి మాంసం నిల్వ ఉన్నదని, ఆహార పదార్థాలకు లేబుల్స్ లేవని తేల్చారు. సంబంధిత నిర్వాహకులకు ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు నోటీసులు జారీ చేశారు.

హోటల్‌లో విద్యుత్ షాక్.. కార్మికుడి మృతి

వెంగళరావునగర్, సెప్టెంబర్ 4: అమీర్‌పేటలోని అమోఘ హోటల్‌లో విద్యుత్ షాక్‌కు గురై.. హోటల్‌లో పనిచేసే ఓ కార్మికుడు మృతి చెందాడు. ఎస్ఆర్ నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి కథనం ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన అమిత్(23), అతడి సోదరుడు పాశ్వాన్‌తో కలిసి అమీర్‌పేట సత్యం మాల్ సమీపంలోని అమోఘ హోటల్‌లో కార్మికులుగా పనిచేస్తున్నారు. బుధవారం ఉదయం 9 గంటల సమయంలో హోటల్‌లో వెట్ గ్రైండర్‌పై పనిచేస్తుండగా.. ఆ గ్రైండర్‌కు విద్యుత్ సరఫరా అయ్యింది. దీంతో పెద్ద శబ్దం వచ్చింది. తోటి కార్మికులు చూడగా విద్యుత్‌షాక్‌తో అమిత్ కిందపడిపోయాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని తోటి కార్మికులు వెంటనే సమీపంలోని దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు మృతి చెందినట్లు నిర్ధారించారు.

అమీర్‌పేటలో కార్మికుడు మృతి చెందిన హోటల్ అమోఘ

అమిత్ సోదరుడు పాశ్వాన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హోటల్‌లో ఎటువంటి రక్షణ ఏర్పాట్లు లేకపోవడం, యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు గుర్తించిన ఎస్ఆర్ నగర్ పోలీసులు.. హోటల్ యజమాని రంగనాథ్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

గణేశ్ విగ్రహం తరలిస్తుండగా..

బండ్లగూడ: గణేశ్ విగ్రహం తరలిస్తున్న క్రమంలో ఓ వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పాండురంగానగర్‌కు చెందిన రమేశ్ శర్మ గణేశ్ నవరాత్రులు సందర్భంగా స్నేహితులతో కలిసి వినాయకుడి విగ్రహాన్ని తీసుకుని వస్తుండగా విద్యుత్ తీగలు తగిలి షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో అతడు కిందపడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని తోటి స్నేహితులు స్థానిక ఆస్పత్రికి తరలించారు.

స్కూల్‌లో దింపుతానంటూ..

విద్యార్థుల కిడ్నాప్‌నకు యత్నించిన ఆటో డ్రైవర్

మరో ఆటోడ్రైవర్ సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు

గంటల వ్యవధిలోనే కిడ్నాప్‌ను ఛేదించిన పోలీసులు

శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 4: స్కూల్‌కు వెళ్తున్న అక్కా, ఇద్దరు తమ్ముళ్లకు ఓ ఆటోడ్రైవర్ మాయమాటలు చెప్పి.. కిడ్నాప్‌నకు ప్రయత్నించాడు. పోలీసులు సకాలంలో స్పందించి కేవలం గంటల వ్యవధిలోనే కిడ్నాప్‌నకు గురైన చిన్నారులను తల్లిదండ్రుల ఒడికి చేర్చారు. ఈ ఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కొండాపూర్ మసీదు బండా గ్రామానికి చెందిన ఓ వ్యక్తి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడి కుతురు(14), ఇద్దరు కుమారులు స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్నారు. బుధవారం ఉదయం 8.30 గంటల సమయంలో అక్కా, ఇద్దరు తమ్ముళ్లు నడుచుకుంటూ పాఠశాలకు వెళ్తున్నారు. కాగా, మసీదుబండా గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ కిరణ్ ముసాద ప్రసాద్(35) ముగ్గురు చిన్నారులను గమనించి, వారికి మాయమాటలు చెప్పి స్కూల్ దగ్గర దింపుతానంటూ ఆటోలో ఎక్కించుకున్నాడు. చిన్నారులు చదువుకుంటున్న ప్రభుత్వ పాఠశాల వైపు వెళ్లకుండా.. గుల్మోహర్‌కాలనీ వైపు చిన్నారులతో వెళ్తున్నాడు. అనుమానాస్పదంగా వ్యహహరిస్తూ ఆటోలో వెళ్తున్న వీరిని గమనించిన అమీన్‌పూర్ ప్రాంతానికి చెందిన మరో ఆటోడ్రైవర్ సాంబయ్య పోలీసులకు సమాచారమిచ్చాడు. గుల్మోహర్‌కాలనీ ప్రాంతం కావడంతో చందానగర్ పోలీసులకు సమాచారమిచ్చారు. వెంటనే అప్రమత్తమైన చందానగర్ పోలీసులు చిన్నారులతో వెళ్తున్న ఆటోను వెంబడించి పట్టుకున్నారు. 10 గంటల ప్రాంతంలో ముగ్గురు చిన్నారులతో పాటు ఆటో డ్రైవర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. చిన్నారులు చదువుతున్న పాఠశాలకు వెళ్లిన పోలీసులు అక్కడ వివరాలు తెలుసుకొని, వారి తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. కిడ్నాప్ జరిగిన ప్రాంతం, చదువుతున్న పాఠశాల గచ్చిబౌలి పీఎస్ పరిధిలోకి వస్తుందని గుర్తించిన చందానగర్ పోలీసులు.. ఆ ముగ్గురు చిన్నారులు, ఆటో డ్రైవర్‌ను గచ్చిబౌలి పోలీసులకు అప్పగించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సమస్యలను పరిష్కరించాలి

బండ్లగూడ సహభవన టౌన్‌షిప్ వాసుల ఆందోళన

హిమాయత్‌నగర్‌లోని హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న టౌన్‌షిప్ వాసులు

హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 4: తమ సమస్యలను పరిష్కరించాలంటూ డిమాండ్ చేస్తూ బండ్లగూడ సహభవన టౌన్‌షిప్ వాసులు బుధవారం హిమాయత్‌నగర్‌లోని తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా టౌన్‌షిప్ ఏ బ్లాక్ అధ్యక్షుడు విశ్వేశ్వర్, ప్రతినిధులు చెరుకూరి శ్రీనివాస్, సాయి మాట్లాడుతూ.. గత కొంత కాలంగా తాము అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. కార్పొరేషన్ ఇచ్చిన హామీ ప్రకారం టౌన్‌షిప్‌లో డెవలప్‌మెంట్ చేయాలని డిమాండ్ చేశారు. తాము ఫ్లాట్లను కొనుగోలు చేసే సమయంలో ప్రహరీ, వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్ పార్కు నిర్మించి ఇస్తామని అధికారులు హామీ ఇచ్చి విస్మరించారని ఆరోపించారు. వర్షాలు పడటంతో సెల్లర్‌లోకి నీరు చేరిందని, ఇండ్లలోకి సైతం గోడల నుంచి నీరు దిగుతున్నాయని, ఎలాంటి మరమ్మతులు చేయకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఫ్లాట్స్ విక్రయించే సమయంలో డెవలప్‌మెంట్ పేరుతో రూ.12 కోట్లు వసూలు చేశారని, ఎలాంటి డెవలప్‌మెంట్ చేయడం లేదన్నారు. ఫ్లాట్స్ అమ్మడం కంటే ముందు నుంచే కోటి పది లక్షల వాటర్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ఆ బిల్లును సైతం తమపైనే మోపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఒకేరోజు.. మూడు చైన్ స్నాచింగ్‌లు

విగ్రహాల ఊరేగింపులో దొంగల చేతివాటం

ముషీరాబాద్, సెప్టెంబర్ 4: వినాయక విగ్రహాలు ఊరేగింపులో దొంగలు తమ చేతివాటాన్ని ప్రదర్శించారు. ఏకంగా మూడు చోట్ల చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. పోలీసుల కథనం ప్రకారం.. మంగళవారం రాత్రి రాంనగర్ చౌరస్తాలో వినాయక విగ్రహాలను మండపాలకు తరలించే క్రమంలో క్రాష్, లైటింగ్, సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. వాహనాలను మళ్లించి, భారీ ఊరేగింపు నిర్వహించారు. ఇదే అదునుగా భావించిన దొంగలు తమ చేతివాటాన్ని ప్రదర్శించారు. నేత శ్రీనివాస్, కొమరయ్య యాదవ్, వీరేశం వేర్వేరు చోట్ల నిలబడి క్రాష్ లైటింగ్ సిస్టం చూస్తుండగా.. వారి మెడలో ఉన్న బంగారు గొలుసులను దొంగలు కొట్టేశారు. నేత శ్రీనివాస్‌కు సంబంధించి తులం బంగారం, కొమరయ్య యాదవ్ రెండు తులాలు, వీరేశంకు సంబంధించిన ఐదు తులాల బంగారు గొలుసును తెంచుకొని దొంగలు పారిపోయారు. బాధితులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

దవాఖాన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

గోషామహల్ ట్రేడర్స్ జేఏసీ

మాట్లాడుతున్న సతీష్ రెడ్డి, బెజిని శ్రీనివాస్ తదితరులు

అబిడ్స్, సెప్టెంబర్ 4: జనావాసాలు, వ్యాపార కేంద్రాల మధ్య ఉస్మానియా దవాఖానను నిర్మించవద్దని గోషామహల్ ట్రేడర్స్ అసోసియేషన్ చైర్మన్ సతీష్ రెడ్డి, అధ్యక్షుడు బెజిని శ్రీనివాస్ కురుమ పేర్కొన్నారు. బుధవారం గోషామహల్‌లోని తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఇరుకైన రోడ్లతో గంటల తరబడి ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతోందన్నారు. దవాఖాన నిర్మాణం జరిగితే స్థానికుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అసలే వ్యాపారాలు లేక సతమత మవుతున్నామన్నారు. దీనికి తోడు గోషామహల్ స్టేడియంలో ఉస్మానియా దవాఖాన నిర్మాణం చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో వ్యాపారులు రోడ్డున పడటం ఖాయమని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి మానవతా దృక్పథంలో ఆస్పత్రి నిర్మాణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో వినోద్ యాదవ్, శ్రీశైలం, ఎం.రమేశ్, విశ్వనాథ్, బంటి, రాజ్‌కుమార్, హరి మోహన్, విజయ్ అగర్వాల్, మనోజ్, రాజేశ్ అగర్వాల్, మనీశ్, మహేందర్, ప్రవీణ్ కోఠారి, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

హయతి కళాశాలలో విద్యార్థుల మధ్య ఘర్షణ

యాజమాన్యం నిర్లక్ష్యం

ఓ విద్యార్థిపై దాడి.. పోలీసులకు ఫిర్యాదు

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 4: యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల విద్యార్థుల మధ్య నెలకొన్న గొడవ చివరకు దాడి వరకు వెళ్లింది. ఈ ఘటన కొంపల్లిలోని హయతి ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ విద్యా సంస్థలో వెలుగులోకి వచ్చింది. బాధిత కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. మెదక్‌కు చెందిన డి.సౌర్యసింగ్ కొంపల్లిలోని హయతి జూనియర్ కళాశాల ఎడ్యుకేషన్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 3న మధ్యాహ్నం తోటి విద్యార్థులు కళాశాల వాష్‌రూం వద్ద ఘర్షణకు దిగి, దాడికి పాల్పడ్డారు. బాధిత విద్యార్థి ఈ విషయాన్ని తన తల్లిదండ్రులతో చెప్పాడు. వారు కళాశాలకు వచ్చి బాధిత విద్యార్థిని పేట్ బషీరాబాద్ పీఎస్‌కు తీసుకెళ్లి ఫిర్యాదు చేశారు. ర్యాగింగ్ కారణంగానే సౌర్యసింగ్‌పై దాడికి పాల్పడ్డారని, కులం పేరుతో కూడా దూషించారని పేర్కొన్నారు. కళాశాల యాజమాన్యం ఈ విషయాన్ని గోప్యంగా ఉంచేందుకు విద్యార్థుల తల్లిదండ్రులకు నచ్చజెప్పడంతో పాటు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదును ఉపసంహరించుకునేలా చేశారని తెలిసింది.

భర్తను హత మార్చిన భార్య

అల్లాపూర్, సెప్టెంబర్ 4: భార్యాభర్తల మధ్య తలెత్తిన చిన్న చిన్న వివాదాలు హత్యకు దారి తీశాయి. విసిగెత్తిన భార్య తన మైనర్ కుమారుడి సహకారంతో భర్తపై దాడిచేసి హతమార్చింది. ఈ ఘటన అల్లాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి కథనం ప్రకారం.. పర్వత్‌నగర్‌లో నివాసముండే పరమేశ్వర్(40), భారతి(35) దంపతులు. వీరికి ఇద్దరు సంతానం. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో కొంత కాలంగా తరచూ గొడవపడుతున్నారు. ఇటీవల గొడవలు పెరిగాయి. ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో భర్యాభర్తల మధ్య గొడవ జరిగింది. భారతి తన కొడుకు (మైనర్) సహాయంతో భర్తను ఇస్త్రీ పెట్టెతో కొట్టింది. అంతటితో ఆగక.. ఇస్త్రీ పెట్టె వైర్‌ను మెడకు బిగించి హత మార్చింది. ఈ దాడిని కూతురు చూసిందని గ్రహించిన భారతి.. చికిత్స నిమిత్తం పరమేశ్వర్‌ను మాదాపూర్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించింది. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు చనిపోయినట్టు నిర్ధారించారు. ఈ విషయం బంధువులకు తెలియడంతో కొడుకుతో సహా భారతి అక్కడి నుంచి వెళ్లిపోయిందని, కేసు నమోదు చేసి, భారతితోపాటు ఆమె కుమారుడిని అరెస్టు చేసినట్టు ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి తెలిపారు.

అనుమతి లేని ప్రకటనల బోర్డుల తొలగింపు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో అనుమతి లేకుండా వెలిసిన అక్రమ హోర్డింగ్స్, బస్ షెల్టర్స్, సెంట్రల్ మీడియన్‌లో ఉన్న ప్రకటనల బోర్డులను జీహెచ్ఎంసీ బుధవారం తొలగించింది. గ్రేటర్‌లో 300 లకు పైగా అనుమతి లేకుండా ప్రకటనల బోర్డులు (అంబరిల్లాలు) ఉన్నట్లు ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో అధికారులు డ్రైవ్ చేపట్టారు. ఈ మేరకు లిబర్టీలో 60 ప్రకటనల బోర్డులు, ఐమాక్స్ సమీపంలో మరికొన్ని ప్రకటనల బోర్డులను తొలగించారు. ఈ ప్రకటనల బోర్డులపై మేయర్ ఫొటో ఉండటం గమనార్హం. మాసబ్‌ట్యాంక్ మెయిన్ రోడ్, కేబీఆర్ పార్కు చుట్టూ ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించకపోవడం అనుమానాలకు తావిస్తుంది.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

ఓం శివదుర్గా జ్యోతిష్యం

★వీరు శివదుర్గ దైవశక్తితో కేరళ సమాధి జపం సర్వమంత్ర సిద్ధి పొంది వున్నారు. అఘోర మరియు నాగసాధువులతో కలిసి సాధన పొంది వున్నారు. ఎటువంటి సమస్యలకైనా 11 రోజులలో పరిష్కారం, శివం రోడ్. ఫోన్: 9866177085
NT-331742

TRAINING

★Boost your Career with Certified IT Trainers! We provide Software Training with Placement Assistance at ISAPI LEARN, Boduppal. Contact: 9059888044.
NT-332526

PACKERS & MOVERS

★Sri Sai Packers & Movers Local and all over India, Resonable Price. Head Office Nacharam: 27176927, Ameerpet: 9866379391, DSNR: 9666993927, KKP: 9949513929, MP: 9848263927, ECIL: 9666983927.
NT-332636

GOLD FINANCE

★మీ బంగారం బ్యాంకుల్లోగానీ, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. Ph: 9100329739.
NT-332623

★మీ బంగారం బ్యాంకుల్లోగానీ, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా, మా డబ్బుతో విడిపించి, మార్కెట్ ధరకు కొనబడును. Ph: 9398709618.
NT-333108

OLD AGE HOME

★వృద్ధులు, Rtd. ఎంప్లాయీస్ విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి, 24/7 మెడికల్ సర్వీస్, ఉప్పల్ మరియు ECIL- కీసర రోడ్, చీర్యాల్ 'X' రోడ్, భోజన వసతితో. ఫోన్: 7981467036, 9391039990, 9515474083.
NT-331743

PLOT FOR SALE

★కలింనగర్ హైవే ఫేస్ ఫేసింగ్‌కి DTCP ఓపెన్ ప్లాట్స్ బెంగళూర్ హైవేకి అతి దగ్గరలో అతి తక్కువ ధరలకే ప్లాట్స్ అమ్మబడును, బ్యాంకు లోన్ Available, Ph: 8885731233, 9948033142.
NT-326216

★షాద్‌నగర్ @ కేశంపేట్‌లో DTCP లేఔట్‌లో, ఫుల్ డెవలప్‌మెంట్స్‌తో 40 EMI పద్ధతిలో 75 గజాల ఓపెన్ ప్లాట్స్ కలవు. నెలకు 10 వేలు మాత్రమే. డైరెక్ట్ కంపెనీ ఆఫర్. సైట్ విజిట్ కొరకు: 9949695027.
NT-331722

★ఔషపూర్ & కేపాల్ దగ్గరలో 100 ఫీట్ రోడ్ ఫేసింగ్‌తో HMDA ప్రాజెక్ట్, 70% బ్యాంకు లోన్‌తో కలదు. స్పాట్ రిజిస్ట్రేషన్. సంప్రదించండి: 9494810299.
NT-339550

★Plot for Sale at Shadnagar, Mahabubnagar, Bhuthpur, Bhongir, HMDA, MUDA, DTCP and Farm Site's for Reasonable Price, EMI also available. Ph: 9392333567.
NT-336704

★ఫ్యూచర్ సిటీ: కేవలం 8 లక్షలకే DTCP వెంచర్‌లో సామాన్యుడికి అందుబాటు ధరలో ప్లాట్ రేరా గేటెడ్. సంప్రదించండి: 9640878566.
NT-336711

★ఘటకేసర్‌కి అతి దగ్గరలో HMDA ప్లాట్లు తక్కువ ధరకు కలవు. ఇప్పుడే ఇళ్లు కట్టుకోవచ్చు. బీబీనగర్ & భువనగిరి వద్ద HMDA ప్లాట్లు కలవు. 9704695889, 9505980640.
NT-332587

★DTCP Layout @ Nandiwanaparthy (Yacharam) 10,299/- per Sq.yd.; YDTA Layout Yadagirigutta 9,299/- per Sq.yd. Call for more Details: 9553147826.
NT-325791

HMDA PLOTS

★ఔషపూర్ కేపాల్ ఎయిమ్స్ దగ్గరలో 100 ఫీట్ రోడ్ ఫేసింగ్ లేఔట్ & 70% బ్యాంక్ లోన్ సౌకర్యంతో అన్ని రకాలుగా అభివృద్ధి చెందిన మా HMDA ప్రాజెక్టులో ప్లాట్లు కొనే సువర్ణ అవకా